గురువారం, తెలంగాణ
12 ఫిబ్రవరి 2026
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

# అభ్యర్థుల భవితవ్యం.. బ్యాలెట్‌లో భద్రం..



## జిల్లాలో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్



### 73.60 శాతం తుదిపోలింగ్ నమోదు.. 13న కౌంటింగ్
### కొత్తగూడెం కార్పొరేషన్‌లో ఉత్కంఠ
## గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఫిబ్రవరి11(నినాదం)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్ మరియు మున్సిపాలిటీల 2వ సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియగా, ఇప్పుడు అందరి దృష్టి ఈ నెల 13న జరగనున్న కౌంటింగ్‌పై కేంద్రీకృతమైంది. మొత్తం 1,85,348 మంది ఓటర్లలో 1,36,423 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 73.60 శాతం పోలింగ్ నమోదు కావడం రాజకీయ వర్గాల్లో ఉత్కంఠను మరింత పెంచింది. అధిక శాతం ఓటింగ్ సాధారణ ఎన్నికల మాదిరిగానే ఉత్సాహాన్ని ప్రతిబింబించడంతో, ఫలితాలు ఏవైపు మొగ్గుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

జిల్లాలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు అశ్వరావుపేట, ఇల్లందు మున్సిపాలిటీల పరిధిలోని 106 వార్డులకు బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించారు. అశ్వరావుపేటలో 76.28%, కొత్తగూడెం కార్పొరేషన్‌లో 74.53%, ఇల్లందులో 68.56% పోలింగ్ నమోదు కావడం గమనార్హం. పురుషులు 73.70%, మహిళలు 73.51%, ఇతర వర్గాలు 78.95% శాతం ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రజాస్వామ్య చైతన్యాన్ని స్పష్టంగా చూపిస్తోంది.

**త్రిముఖ సమరం అసలు పోరు కార్పొరేషన్‌పైనే**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఈ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ రంగస్థలంగా మారింది. సిపిఐ, కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య నేరుగా త్రిముఖ పోటీ నెలకొంది. ప్రతి వార్డు స్థాయిలో స్థానిక సమీకరణాలు, వ్యక్తిగత ప్రభావం, సామాజిక వర్గాల మద్దతు కీలకంగా మారాయి. బిఆర్ఎస్ గత స్థానిక ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తుండగా, రాష్ట్ర అధికారాన్ని ఆధారంగా చేసుకుని కాంగ్రెస్ పట్టణ రాజకీయాల్లో తన స్థానం బలపరచుకోవాలనే వ్యూహంతో ముందుకెళ్లింది. సిపిఐ సంప్రదాయ కార్మిక వర్గాలు, సంఘటిత శక్తిని ఆశ్రయించి కీలక వార్డుల్లో గట్టి పోటీ ఇచ్చింది. త్రిముఖ పోటీ కారణంగా ఓట్ల విభజన అనివార్యమవుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

**బిజెపి -మనుగడకు పరీక్ష..**

బిజెపి ఈ ఎన్నికలను తన రాజకీయ మనుగడకు కీలకంగా భావిస్తోంది. పట్టణ రాజకీయాల్లో స్థిరమైన స్థానం సంపాదించాలంటే కనీసం గణనీయ స్థానాలు సాధించాల్సిన అవసరం ఉందని పార్టీ భావిస్తోంది. ఓటు శాతం పెంపు లక్ష్యంగా బూత్ స్థాయిలో శ్రమించినా, త్రిముఖ పోటీలో తన



ఓటు ఎంతవరకు ప్రభావం చూపుతుందన్నది కౌంటింగ్ రోజునే స్పష్టమవుతుంది.

**అధిక పోలింగ్ - మార్పు సంకేతమా?**

73.60 శాతం పోలింగ్ రాజకీయ విశ్లేషణకు దారి తీస్తోంది. అధిక ఓటింగ్ సాధారణంగా మార్పు కోరికకు సంకేతమని కొందరు విశ్లేషకులు భావిస్తుండగా, మరికొందరు ఇది అన్ని పార్టీల కఠిన పోటీ ఫలితమని చెబుతున్నారు. మహిళల పోలింగ్ శాతం పురుషులతో సమానంగా ఉండటం, ఇతర వర్గాల పాల్గొనడం అధికంగా ఉండటం కూడా ఫలితాలపై ప్రభావం చూపే అంశాలుగా భావిస్తున్నారు.



**బ్యాలెట్ లెక్కింపు - ప్రతి రౌండ్ కీలకం**

ఈ సారి బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరగడంతో కౌంటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా సాగనుంది. ప్రతి టేబుల్, ప్రతి రౌండ్ ఫలితం ఉత్కంఠను పెంచే అవకాశముంది. స్వల్ప మెజార్టీలతో గెలుపోటములు తేలే పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా కార్పొరేషన్‌లో మెజారిటీకి అవసరమైన సంఖ్యపై అన్ని పార్టీల దృష్టి నిలిచింది. కాగా బ్యాలెట్ బాక్సులు కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచినట్లు అధికారులు తెలిపారు. 13న అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో పారదర్శకంగా లెక్కింపు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**జిల్లా రాజకీయాలకు మలుపు**

ఈ ఎన్నికల ఫలితాలు కేవలం స్థానిక సంస్థల పరిమితిలోనే కాకుండా, జిల్లా రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపే అవకాశముంది. పట్టణ ప్రాంతాల్లో ఏ పార్టీ బలపడుతుందో, ఏ పార్టీ వెనుకడుగు వేస్తుందో అన్నది భవిష్యత్ ఎన్నికలకు సంకేతాలుగా మారవచ్చు. ప్రశాంతంగా ముగిసిన పోలింగ్ తర్వాత ఇప్పుడు రాజకీయంగా అత్యంత ఉత్కంఠభరిత దశ మొదలైంది. 13వ తేదీ కౌంటింగ్ రోజున వెలువడే తీర్పు కొత్తగూడెం పట్టణ రాజకీయ దిశను నిర్ణయించనుంది. త్రిముఖ సమరంలో ఎవరి వ్యూహం ఫలిస్తుందో, ఎవరి సమీకరణాలు పనిచేస్తాయో, బిజెపి మనుగడ సమరం ఎంతవరకు సఫలమవుతుందో అన్నది మరికొద్ది గంటల్లోనే తేలనుంది.





# అడవి 'నాయక'త్వం.. ధర్మపోరాటంలో ఆదిమ వీరత్వం!



భారతీయ ఇతిహాసం అంటే కేవలం కురుపాండవుల రక్తపాతం మాత్రమే కాదు.. అది అడవికీ, అగ్రవర్ణ నాగరికతకూ మధ్య జరిగిన అద్భుత సమన్వయం. పట్టు పరుపుల మీద పెరిగిన పాండవ మధ్యముడు 'భీముడు'.. అడవిని నమ్ముకున్న ఆదిమ వీరవనిత 'హిడింబి' పాదాల చెంత మోకరిల్లిన నాడే మహాభారత గమనంలో ఒక నవశకం మొదలైంది. కానీ, దురదృష్టవశాత్తూ మన చరిత్రకారులు అడవి బిడ్డల త్యాగాలను 'రాక్షస' ముద్ర వేసి అగాధంలోకి తొక్కేశారు. నాయక పోడ్లు అనే గిరిజన వీర తెగ ప్రస్తావన లేని పాండవ వనవాసం ఒక అసంపూర్ణ కావ్యం.

**రాక్షసత్వం కాదు.. అది రక్షణ కవచం!**

వారణావతపు కుట్రల నుంచి ప్రాణాలతో బయటపడి, నిప్పులు చెరిగే కళ్లతో అడవిలోకి అడుగుపెట్టిన పాండవులకు ఆశ్రయమిచ్చింది పచ్చని ప్రకృతి మాత్రమే కాదు, ఆ ప్రకృతిని కంటికి రెప్పలా కాపాడుకునే నాయక పోడ్లు. హిడింబిని 'రాక్షసి' అని పిలవడం ఆమెను అవమానించడమే. ఆమె ఒక రాజ్యానికి వారసురాలు, ఒక తెగకు ఆశాకిరణం, యుద్ధ తంత్రం తెలిసిన వీరనారి. పరాయి వ్యక్తులు తమ అడవిలోకి అడుగుపెడితే గొడ్డలి పట్టే ఆమె తెగువ రాక్షసత్వం ఎలా అవుతుంది? అది తన మట్టిని కాపాడుకునే మాతృత్వపు ఆవేదన. భీముడి భుజబలాన్ని చూసి మోహించడమంటే, ఒక వీరుడికి మరో వీరవనిత ఇచ్చిన అత్యున్నత గౌరవం.

**పోడు వ్యవసాయం - అక్షయపాత్ర సిద్ధాంతం**

నాగరిక ప్రపంచానికి కొండల మీద వ్యవసాయం చేయడం అంటే అద్భుతం కావచ్చు, కానీ నాయక పోడ్లకి అది జీవనవేదం. పాండవుల వనవాస కాలంలో వారికి ఆకలి తీర్చింది అక్షయపాత్ర మాత్రమే కాదు.. ఆ పాత్రలోకి ధాన్యాన్ని, కందమూలాలను చేర్చిన నాయక తెగ శ్రమ. కొండలను పిండి చేసి పంటలు పండించే పోడు సంస్కృతే పాండవుల మనుగడకు ప్రాణాధారమైంది. ద్రౌపదికి సౌగంధిక పుష్పాలు దొరికినా, అర్జునుడికి పాశుపతాస్త్రం లభించినా.. వాటన్నింటి వెనుక అడవి బిడ్డల అడుగుజాడలు ఉన్నాయి. సాక్షాత్తు పరమశివుడు కూడా అర్జునుడి గర్వాన్ని అణచడానికి ఒక 'కిరాతకుడి' (నాయక వేటగాడి) రూపంలో వచ్చాడంటే, ఆ తెగకున్న సామాజిక గౌరవం ఎంతో అర్థం చేసుకోవచ్చు.

**ఘటోత్కచుడు! ఒక జాతి త్యాగ నిరతికి పతాక!**

మహాభారత సంగ్రామంలో అత్యంత విషాదకరమైన, వీరోచితమైన ఘట్టం ఏదైనా ఉంటే అది ఘటోత్కచుడి వీరమరణమే. రాజ్యాధికారం కోసం సోదరులు కొట్టుకుంటుంటే, ఏ సంబంధం లేని అడవి బిడ్డ తన తండ్రి పక్షాన నిలిచి కురుసేనను చీల్చి చెండాడాడు. కర్ణుడి వద్ద ఉన్న బ్రహ్మాస్త్రాన్ని తన గుండెకు అడ్డుపెట్టుకుని అర్జునుడిని కాపాడిన ఆ ప్రాణ త్యాగం.. అడవి బిడ్డల విశ్వసనీయతకు నిదర్శనం. హిడింబి తన కొడుకును యుద్ధానికి పంపుతూ అడవి నేర్పిన నీతిని, ధర్మాన్ని గుండెల్లో నింపి పంపింది. ఒక తల్లిగా తన పేగును కోసుకుని ధర్మ సంస్థాపన కోసం ఆహుతి ఇచ్చిన ఆ గొప్పతనం ఏ రాజకుమారికి ఉంటుంది?

**నేటికీ సజీవం.. ఆ వీరగాథ!**

తెలంగాణ నుంచి ఒడిశా వరకు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో విస్తరించిన నాయక పోడ్ల సంస్కృతి నేటికీ హిడింబిని 'వనదేవత'గా కొలుస్తోంది. పాలకుల నిర్లక్ష్యం వల్ల, చరిత్రకారుల వివక్ష వల్ల ఈ వీర చరిత్ర చీకటిలోనే ఉండిపోయింది. పాండవులకు రక్షణగా నిలిచిన ఆ వీర తెగ నేడు తమ ఉనికి కోసం, పోడు భూముల కోసం పోరాడాల్సి రావడం మన వ్యవస్థకే సిగ్గుచేటు.

మహాభారతం ఒక సముద్రమైతే, అందులో నాయక పోడ్ల చరిత్ర ఒక సునామీ. హిడింబి ఆత్మగౌరవాన్ని, ఘటోత్కచుడి త్యాగాన్ని, పోడు సంస్కృతిలోని శ్రమను గుర్తించిన రోజే భారతదేశానికి తన మూలాల మీద గౌరవం పెరుగుతుంది. అడవి తల్లి సాక్షిగా.. ఈ సత్యం ఎప్పటికైనా వెలుగులోకి రావాల్సిందే!

**- వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**



# జీవ పరిణామ సిద్ధాంతానికి ఆద్యుడు చార్లెస్ డార్విన్

ప్రకృతిలో మార్పే నిత్య సత్యం,
జీవుల పయనం అది సాక్ష్యం.
బలమైనవాడు ముందుకు సాగె,
బలహీనుడు కాలంతో మాయమాగె.
ఎవల్యూషన్ రహస్యం చెప్పు,
ప్రకృతి నియమం చూపించినవాడు.
డార్విన్ చూపిన మార్గమిదే,
జీవజాలం కథ చెప్పినవాడే.
చార్లెస్ రాబర్ట్ డార్విన్ గొప్ప సైంటిస్ట్



**1809 ఫిబ్రవరి 12 న జన్మించారు ఇంగ్లాండుకు చెందిన ప్రకృతివాది. డార్విన్, ఒక ప్రకృతి శాస్త్రవేత్తగా, భూగర్భశాస్త్రవేత్తగా, జీవశాస్త్రవేత్తగా, రచయితగా ప్రసిద్ధుడు. ఒక వైద్యుని వద్ద సహాయకుడిగాను, రెండేళ్ళ పాటు వైద్య విద్యార్థిగాను ఉన్న డార్విన్, ఆధ్యాత్మిక విద్య చదువుకున్నాడు. జంతు చర్మాల్లో గడ్డి లాంటి వాటిని కూరి వాటిని బ్రతికున్నవాటిలా కనబడేలా చేసే పనిలో శిక్షణ పొందాడు. ఇతను, భూమిపై జీవజాలము ఏ విధంగా పరిణామక్రమం చెందినది అనే విషయంపై పరిశోధనలు చేసి, జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడుఅతని పేరును తలుచుకుంటే చాలు ఎవరికైనా సరే వెనువెంటనే గుర్తుకు వచ్చేది పరిణామ సిద్ధాంతం.**


ప్రకృతిలో జీవజాతులు తమ ఉమ్మడి పూర్వీకుల నుంచి క్రమానుగతంగా పరిణామం చెందుతూ ఏర్పడ్డాయని డార్విన్ వివరించాడు. ఈ సిద్ధాంతం సర్వత్రా ఆమోదం పొందింది. విజ్ఞాన శాస్త్రంలో దీన్ని ఒక మౌలికమైన భావనగా భావిస్తారు.డార్విన్ 1809 ఫిబ్రవరి 12న ఇంగ్లండులోని ష్రూస్‌బరీలో జన్మించాడు.వైద్యుడైన తండ్రి అన్ని సదుపాయాలూ సమకూర్చినా అతడు చదువులో రాణించలేదు. అతడొక మందబుద్ధి అని ఉపాధ్యాయులు భావించేవారు. అతను చిన్ననాటి నుండి కీటకాలను, ఖనిజాలను సేకరిస్తూ రసాయనిక శాస్త్రంలో పరిశోధనలు చేస్తూ ఉండేవాడు. 16 యేండ్ల వయస్సులో వైద్య విద్య చదవటం కోసం అతన్ని ఎడిన్‌బరో విశ్వవిద్యాలయంలో చేర్పించారు. కాని మత్తుమందులు లేకుండా చేస్తున్న ఆపరేషన్లను చూచి, ఆ చిత్రహింసకు కలత చెంది, వైద్యవిద్యపై మనసు పెట్టి చదవలేక పోయాడుఏదో ఒక డిగ్రీ సంపాదించాలనే తండ్రి కోరిక మేరకు కేంబ్రిడ్జ్‌లో తత్త్వశాస్త్ర అధ్యయనంలో చేరాడు. అక్కడి ప్రొఫెసర్ ఓసారి అతడికి ఓ ఓడ కెప్టెన్‌ను పరిచయం చేశాడు. ఆ కెప్టెన్ నడిపే ఓడ పేరు 'బీగల్'. వివిధ దేశాల్లో, దీవుల్లో ఉండే జీవుల పరిశీలనకు అవకాశం ఉంటుందనే ఆలోచనతో డార్విన్ తన తండ్రి వద్దంటున్నా వినకుండా బీగిల్ ఓడ ఎక్కేశాడు. ఆ నౌకాయానంలో డార్విన్ అనేక ప్రాంతాల్లో మొక్కలు, రాళ్లు, శిలాజాలు, కీటకాలు, జంతువులను పరిశీలించి చాలా నమూనాలను సేకరించి ఇంటికి పంపుతూ వచ్చాడు. ఆ పరిశీలనల ఆధారంగానే జీవజాతుల పరిణామ క్రమంపై పుస్తకం రాశాడు. 150 సంవత్సరాల క్రితం రాసిన ఈ గ్రంథం ఇప్పటికీ ప్రామాణికంగా నిలిచి ఉంది. జీవుల్ని ఏదో అతీత శక్తి ఏకకాలంలో సృష్టించలేదని, అవి వివిధ దశల్లో ప్రకృతివరణం (నేచురల్ సెలక్షన్) ద్వారా పరిణామం చెందాయని డార్విన్ సిద్ధాంతం చెబుతుంది. ఇది ఇప్పటి మైక్రోబయాలజీ, జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీలను సంఘటిత పరచడంలోనూ, డీఎన్ఏ పరీక్షల్లోనూ ప్రముఖ పాత్ర వహిస్తోంది.

చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం భూమి మీది జీవుల పరిణామ క్రమాన్ని తెలియజేస్తుంది. ఆధునిక జీవ శాస్త్రంలో డార్వినిజం చాలా మార్పు తెచ్చింది. మూఢ నమ్మకాలను వ్యతిరేకించడంలో కూడా డార్వినిజం కీలక పాత్ర పోషించింది. మనిషి ఒక రకమైన తోక లేని కోతిజాతి నుంచి పరిణామం చెందుతూ వచ్చాడని, మనిషిని దేవుడు సృష్టించలేదన్న సిద్ధాంతాన్ని తెర మీదకు తెచ్చింది. ఇప్పుడు కూడా సృష్టివాదం పేరుతో డార్వినిజాన్ని వ్యతిరేకించే వాళ్ళు ఉన్నారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం మార్క్సిస్టు చారిత్రక భౌతికవాద రచనలకి కూడా ఊపిరిపోసింది. మలేషియా నుంచి రస్సెల్ వాలేస్ (1823- 1913) అనే వ్యక్తి పంపిన సిద్ధాంత వ్యాసం డార్విన్ వ్యాసం ఒకే విధంగా ఉన్నాయి. డార్విన్ 1844లో తన రచననూ, వాలేస్ పంపిన వ్యాసాన్నీ లియన్ సొసైటీ జర్నల్‌కు అందచేశాడు. 1858 జూలై 15న శాస్త్రవేత్తల సమావేశం జరిగింది. ఇరువురి వ్యాసాలను పరిశీలించారు. 1844లో డార్విన్ తన వ్యాసాన్ని మొదలు పెట్టగా, వాలేస్ 1858లో రాశాడు. కనుక డార్విన్ ముందు రాసినట్టు నిర్ధారించారు.

1831 లో విజ్ఞాన శాస్త్ర పరిశోధనల నిమిత్తం యురోపియన్ దేశాలను చుట్టిరావటానికి బయలు దేరిన బీగల్ ఓడలో ప్రకృతివేత్తగా ప్రయాణం చేసే అవకాశం డార్విన్ కి లభించింది. ఈ అవకాశం ఆయన పాలిట సువర్ణావకాశమై గొప్ప శాస్త్రీయ అవిష్కరణకు ఆధారభూతమైనది. అయిదేళ్ళపాటు కొనసాగిన ఈ సముద్ర యానంలో డార్విన్ ఎన్నో రకాల ప్రదేశాలను, జంతువులను దర్శించాడు. ప్రకృతికి, జీవరాశికి మధ్య ఉన్న సంబంధ బాంధవ్యాల గురించి తీవ్రంగా ఆలోచించాడు. ఈ ఆలోచన ఫలితమే ప్రకృతివరణ సిద్ధాంతంగా (నేచురల్ సెలక్షన్ థియరీ) గా పరిణమించింది.వీరు 1882 ఏప్రిల్ 19 న మరణించారు

ప్రతి ఒక్కరు వీరిని స్ఫూర్తిగా తీసుకుని నేటి శాస్త్రవేత్తలు మరెన్నో పరిశోధనలు చేయాలి.







**- కామిడి సతీష్ రెడ్డి.**
**జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా**
**9848445134**

# నినాదం

గురువారం 11 ఫిబ్రవరి 2026

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం


## గౌడ జన హక్కుల పోరాట సమితి మండల కమిటీ ఎన్నిక



**పాలేరు ఫిబ్రవరి 11( నినాదం):**
గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) మండల కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన కమిటి ని ఎన్నుకున్నారు. మండల కమిటి అధ్యక్షుడు గా గునగంటి రామమూర్తి గౌడ్, ఉపాధ్యాక్షు లు గా పోలంపల్లి వీరయ్య, గడ్డం కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి గా దంతాల రవిగౌడ్, కార్యదర్శులు గా బీసు వీరయ్య గౌడ్, అధికార ప్రతినిధి గా కొండా ధనయ్య, సోషల్ మీడియా కన్వీనర్ గా అనంతు నాగేందర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా సమ్మెట యుగంధర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి జిల్లా అధ్యక్షుడు బండి నాగేశ్వరరావు నియమాకపు,పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో చావా ముత్యాలరావు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కోదండరామ్ రాక..!

**పాలేరు ఫిబ్రవరి 11( నినాదం):**
తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు కోదండరామ్ గురువారం నేలకొండపల్లి లో పర్యటించనున్నట్లు జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.పర్యటన వివరాలను వెల్లడించారు. టీజెఎస్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జరిగే ర్యాలీ లో పాల్గొంటారని తెలిపారు. కూసుమంచి రోడ్ లో ఏర్పాటు చేసిన నూతన జెండా ను ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం స్థానిక భక్తరామదాసు ధ్యాన మందిరం ను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ప్రకటించారు. 11 గంటలకు నేలకొండపల్లి లో జరిగే పాలేరు నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశం లో పాల్గొంటారని తెలిపారు. కోదండరామ్ తో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్కుమార్, జిల్లా ఇంచార్జీ గోపగాని శంకర్రావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## వైభవంగా మల్లికార్జున స్వామి పట్నాలు



**ధర్మారం ఫిబ్రవరి 11 (నినాదం):**
మండలంలోన చింతలపల్లి గ్రామం లో జరుగుతున్నటువంటి జెండా మల్లికార్జునస్వామి పట్నాలు బోనాలకు ఈరోజు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొల్లి స్వామి దాగెటి రాజేశ్వరి కొమురయ్య హాజరయ్యారు. ఒగ్గు పూజారులు వారికి స్వామి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమం లో చింతలపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నారా లక్ష్మన్ ఆలయ చైర్మన్ కొమ్మ కుమార్ కత్తెర్ల కొమురయ్య కత్తెర్ల సందీప్ చింతకుంట గట్టయ్య పుట్ట శ్రీనివాస్ కత్తెర్ల లచ్చన్న పాల్గొన్నారు.

## పాత్రికేయులు ఆధ్వర్యంలో నూతన సీఐకి సన్మానం



**గుండాల, ఫిబ్రవరి 11 (నినాదం):**
మండలకేంద్రంలో బుధవారం గుండాల మండల పాత్రికేయుల ఆధ్వర్యంలో గుండాల పోలీస్ స్టేషన్ లో సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సీఐ తిరుపతి ని పాత్రికేయులు సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గడ్డం వీరన్న, దడిగల శ్రీను, బత్తిని వినయ్, బొమ్మర్ల రవి,చేబోతు రంజిత్ కుమార్, ఎట్టి సుందర్, మలిపెద్ది పవన్, సల్లూరి సురేష్ పాల్గొన్నారు.

## శిక్షణ తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాలి

### - జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):**
మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు నియమితులైన కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. కౌంటింగ్ విధులకు నియమించబడిన సిబ్బందిని వారి సంబంధిత అధికారులు రెండు రోజులపాటు విధుల నుండి విడుదల చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ శిక్షణ తరగతి 12న ఉదయం 10:30 గంటలకు అంబేద్కర్ స్టేడియంలోని మినీ ఫంక్షన్ హాల్, భూపాలపల్లిలో నిర్వహించబడుతుందని తెలిపారు. నియమితులైన సిబ్బంది అందరూ సమయానికి హాజరై శిక్షణలో పాల్గొనాలని సూచించారు. అలాగే, కౌంటింగ్ విధులు 13 న ఉదయం 7:00 గంటలకు అదే ప్రాంగణంలో ప్రారంభమవుతాయని, అందరూ తప్పనిసరిగా హాజరై తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి ఒక్కరి సహకారం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని శ్రీ కాళేశ్వరం కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు బుధవారం ఆలయ ఈఓ, పూజారి ఆహ్వానపత్రికను అందించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో అర్చకులు కలెక్టర్ కు మహాశివరాత్రి ఉత్సవాల ప్రాధాన్యతను వివరించి, ఈ నెల 15న నిర్వహించనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, జాగరణ, రథోత్సవం తదితర వేడుకలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. కలెక్టర్ రాహుల్ శర్మ మహాశివరాత్రి సందర్భంగా కాళేశ్వరం దేవస్థానానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారని పేర్కొంటూ,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.భద్రత, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు వంటి అంశాల్లోసమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. కాళేశ్వరం మహాక్షేత్రంలోమహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేష్, పూజారి తదితరులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ ద్వారా బీమా భరోసా

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 11 (నినాదం);**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన కింద మృతుల కుటుంబాలకు భీమా చెక్కులు అందజేశారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ పరమేశ్వర్ బుధవారం ఈ చెక్కులను బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తకొండ గ్రామానికి చెందిన కందుల సారయ్య, ధర్మారం గ్రామానికి చెందిన కాదాసు స్వరూప ఇటీవల అనారోగ్య కారణాలతో మృతిచెందారని తెలిపారు. వారు యూనియన్ బ్యాంకులో ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజనలో సభ్యులుగా ఉండటంతో, ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున భీమా మొత్తాన్ని చెక్కుల రూపంలో అందజేశామని వివరించారు.

# కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత

### -జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి వెల్లడి







**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 11(నినాదం)**
కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డి.సునీతా రెడ్డి వెల్లడించారు. వనపర్తి జిల్లా పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఆత్మకూర్, అమరచింత, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సరళి, పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్త్ ఏర్పాట్లను, కౌంటింగ్ సెంటర్ల భద్రత ఏర్పాట్లను బుధవారం జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి పరిశీలించారు.ఆత్మకూరు, అమరచింత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించి పోలింగ్ సరళి, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో మున్సిపల్ ఎన్నికలు కొనసాగేలా చూడాలని కోరారు.పోలీసులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఓటు వేయడానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, క్యూ లైన్ లో ఉండేలా చూడాలని ఆయన తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలీస్ విభాగం హై అలర్ట్‌లో కొనసాగాలని, శాంతిభద్రతలను కాపాడడంలో ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యతగా ఉండాలని తెలిపారు.ఆత్మకూరు, అమరచింత మున్సిపాలిటీలలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నా యని, చివరి సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండి కట్టుదితమైన భద్రత ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరగాలనే ఉద్దేశంతో కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సమగ్రంగా పరిశీలించారు. సీసీటీవీ పర్యవేక్షణ, ప్రవేశ నియంత్రణ, సిబ్బంది విధులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. పోలింగ్, కౌంటింగ్ సమయంలో ప్రజలు పోలీసు వారికి సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిసిఆర్బి డిఎస్పి బాలాజీ, ఆత్మకూరు సీఐ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, సిసిఎస్ సీఐ అశోక్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆత్మకూరు ఎస్సై జయన్న, అమరచింత ఎస్సై స్వాతి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## సీఎం కప్ అర్చరిలో స్వర్ణం పతకం సాధించిన పట్వారిగూడెం యువతి



**దమ్మపేట, ఫిబ్రవరి 11(నినాదం):**
పాల్వంచ వేదికగా జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ అర్చరి పోటీల్లో దమ్మపేట మండలం పట్వారిగూడెం గ్రామానికి చెందిన కనకం లోహిత శ్రీ అద్భుత విజయాన్ని సాధించారు. మహిళల రికర్వ్ విభాగంలో తన గురి తప్పని అస్త్రాలతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి ఆమె బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన లోహిత శ్రీ, క్రమశిక్షణతో కూడిన సాధనతో జిల్లా స్థాయి పోటీల్లో అగ్రస్థానంలో నిలవడం పట్ల దమ్మపేట మాజీ జడ్పీటీసి పైడి వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసి చైర్మన్ కోయ్యల అచ్యుతరావు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయంతో ఆమె రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించడం పట్ల పట్వారీగూడెం గ్రామం పేరును జిల్లా స్థాయిలో నిలబెట్టిన లోహిత శ్రీని పలువురు ప్రముఖులు అభినందించారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించాలని గ్రామస్తులు క్రీడాకారులు కోరుకుంటున్నారు.

# ధర్మపురిలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్





### 75.16 శాతం ఓటింగ్‌తో జిల్లాలో మొదట నిలిచిన ధర్మపురి

**ధర్మపురి ఫిబ్రవరి 11(నినాదం):**
జగిత్యాల జిల్లా ధర్మపురి మున్సిపాలిటీలో జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. మొత్తం 15 వార్డుల పరిధిలో ఏర్పాటు చేసిన 29 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపాలిటీలో మొత్తం 14,035 మంది ఓటర్లు నమోదు కాగా, అందులో 6,722 మంది పురుషులు, 7,310 మంది మహిళలు, 3 మంది ఇతరులు ఉన్నారు. సాయంత్రం 5 గంటల వరకు నమోదైన వివరాల ప్రకారం 10,549 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవడంతో 75.16 శాతం పోలింగ్ నమోదైంది.పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ స్వయంగా పరిశీలించి ఎన్నికల నిర్వహణను సమీక్షించారు. సీ ఐ రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకొనేందుకు పోలింగు కేంద్రాల వద్దకు చేరుకోగా విధుల్లో ఉన్న పోలీసులు అధికారులు సహాయం అందించారు . నెట్‌వర్క్ సీ ఐ శ్రీధర్, ఎస్ ఐ మహేష్, పెగడపల్లి ఎస్ ఐ కిరణ్ కుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు.అధికారుల సమన్వయంతో పోలింగ్ ప్రశాంతంగా పూర్తవడంతో ఇప్పుడు రాజకీయ పార్టీల దృష్టి ఓట్ల లెక్కింపుపై కేంద్రీకృతమైంది.

# మంగళపల్లిలో బుధవారం వారసంత ప్రారంభం



**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 11 (నినాదం):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని మంగళపల్లి గ్రామంలో నూతనంగా బుధవారం వారసంత (కూరగాయల మార్కెట్) ప్రారంభమైంది. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ వారసంతను ఏర్పాటు చేయడం జరిగిందని గ్రామ ప్రతినిధులు తెలిపారు. బుధవారం సాయంత్రం రాంనగర్ గ్రామ సర్పంచ్ దప్పు శ్రీనివాస్, ఉప సర్పంచ్ తిరుపతి, వార్డు సభ్యులు సంయుక్తంగా ఈ కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రారంభమైన మొదటి రోజే మంగళపల్లి గ్రామ ప్రజలతో పాటు సమీపంలోని రాంనగర్ తండా, బొల్లోనిపల్లి గ్రామస్తులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చి మార్కెట్‌ను వినియోగించుకున్నారు. గ్రామంలోనే వారసంత ఏర్పాటు కావడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సౌకర్యం కలిగిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


# ట్రాక్టర్ ఆటో ఢీకొని ఇద్దరు శివ స్వాములు మృతి




**కల్వకుర్తి ఫిబ్రవరి 11 (నినాదం):**
కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండలం కొట్ర గ్రామ శివారులో కల్వకుర్తి హైదరాబాద్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీశైలం వెళ్తున్న ఇద్దరు శివ స్వాములు మృతి చెందారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొట్ర గ్రామ శివారులో కేసీఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో హైద్రాబాద్-కల్వకుర్తి రహదారిపై హైదరాబాద్ నుండి శ్రీశైలం వెలుతున్న ఆటో, కల్వకుర్తి నుంచి కొట్ర వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు శివ స్వాములు వనపర్తి జిల్లా పాన్ గల్ మండలం తెల్ల రాళ్లపల్లి తండాకు చెందిన కేతవత్ సురేష్ (30), వికారాబాద్ జిల్లా బొంరాస్పేట్ మండలం ఎరుపుమళ్ళ గ్రామానికి చెందిన కడమంచి సత్యనారాయణ లు మృతి చెందారు. ఆటోలో గ్యాస్ నింపుకోవడానికి కల్వకుర్తి వైపు వెళ్తున్నట్లు సమాచారం. మృత దేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాదు బీరంగూడ లో ఆటో నడుపుకుంటూ వీరు జీవనం కొనసాగిస్తున్నారు. శివ మాలాధారణ వేసి హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్తున్నారు. ఈ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఈ మేరకు ఎస్సై కురుమూర్తి ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

### -బాలాజీ నగర్ విద్యుత్ ఏఈ సాంబశివరావు



**జవహర్ నగర్, ఫిబ్రవరి 11 నినాదం):**
11 కెవి బాలాజీ నగర్ సబ్ స్టేషన్ పరిధి లోని ఏడు ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలను కత్తిరించడం, విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్ పనుల కారణంగా గురువారం ఈ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని బాలాజీ నగర్ విద్యుత్ ఏఈ సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభావిత ప్రాంతాలు చెన్నాపురం, లక్ష్మీనరసింహ కాలనీ, శివనగర్, ఆదర్శనగర్, వికలాంగుల కాలనీ, సింగల్ బెడ్ రూమ్, డబుల్ బెడ్ రూములు, ముత్తుస్వామి కాలనీ, బీరప్ప గడ్డ, భగత్ సింగ్ కాలనీ, గబ్బిలాలపేట ,శాంతినగర్, రాజీవ్ నగర్, మోహన్ రావు కాలనీ, వి కే ఎంక్లేవ్, ఎక్స్ సర్వీస్మెన్ కాలనీ, అయ్యప్ప కాలనీ ,సిటిజన్ కాలనీ, ఆనంద నగర్, సాయిబాబా టెంపుల్ రోడ్, వెంకటేశ్వర కాలనీ, బాలాజీ నగర్ మెయిన్ రోడ్డు, మార్వాడి గల్లి, మహంకాళి కాలనీ, సుక్కమ కుంట, సుభద్రయ్య కాలనీ, తదితర ప్రాంతాలలో ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించాలని బాలాజీ నగర్ విద్యుత్ ఏఈ సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## కోదాడలో అత్యల్ప శాతం నమోదు!

**కోదాడ, ఫిబ్రవరి 11 ( నినాదం):**
సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 79.90 శాతం పోలింగ్ నమోదైంది.తుంగతుర్తిలో అత్యధికంగా 88.36 శాతం పోలింగ్ నమోదు కాగా, హుజూర్నగర్‌లో 82.88 శాతం నమోదైంది. సూర్యాపేటలో 79.38 శాతం, నేరేడుచర్లలో 79.24 శాతం పోలింగ్ నమోదయ్యాయి. జిల్లా వారీగా అత్యల్పంగా కోదాడలో 77.05 శాతం మాత్రమే పోలింగ్ నమోదవడం గమనార్హం. ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఓటర్లు పెద్ద సంఖ్యలో ఓటు వేయలేదని స్థానికులు చెబుతున్నారు.

## వంగరలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా అడుగు

### -బోరు పనులు ప్రారంభించిన సర్పంచ్



**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 11 (నినాదం);**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మరో కీలక అడుగు పడింది. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వంగర గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ బోరు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి వేసవికాలంలో గ్రామ ప్రజలు ఎదుర్కొనే తాగునీటి ఇబ్బందులను పూర్తిగా తొలగించాలనే సంకల్పంతో ఈ పనులను చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు నిరంతరంగా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, గ్రామపం చాయతీ నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల సహకారం, ప్రజాప్రతినిధుల మద్దతుతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వల్లాల రమేష్, శ్రీరామోజు మొండయ్య, బత్తిని రజిత, కాల్వ అంజలి, మారం సతీష్, బత్తిని అశోక్, రామారపు స్వరూప, కొండ తిరుపతి, గిద్ద శ్రీనివాస్, షేక్ రషీద్, రఘునాయకుల సేనా రెడ్డి, రఘునాయకుల మల్లారెడ్డి, ఉల్లాల రవి, వల్లాల ఇందిరా తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో చేపట్టిన ఈ బోరు పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరారు.

# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
గురువారం, తెలంగాణ
12 ఫిబ్రవరి 2026


### దీన్ దయాళ్ జి విగ్రహానికి పూలమాలవేసి
### నివాళులర్పించిన మాజీ కార్పొరేటర్




**మల్కాజిగిరి, ఫిబ్రవరి 11( నినాదం):** ఏకాత్మ మానవవాద సిద్ధాంతకర్త, అంత్యోదయ స్ఫూర్తి ప్రధాత, బిజెపికి పటిష్ట పునాదులు వేసిన సమర్థ నిర్వాహకుడు "పండిట్ దీన్ దయాళ్" ఉపాధ్యాయ వర్ధంతి రోజున ప్రతీకగా జరుపుకుంటున్న 'సమర్పణ దివస్' సందర్భంగా బుధవారం వినాయకనగర్ డివిజన్ లోని దీనదయాళ్ నగర్ లోని పండిట్ దీన్ దయాళ్ జి విగ్రహానికి మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పూలదండలు వేసి నివాళులర్పించారు.

### నేడు సార్వత్రిక సమ్మెలో
### ఆశా వర్కర్స్ ఐక్యంగా పాల్గొని జయప్రదం చేద్దాం
#### జవహర్ నగర్ పిహెచ్‌సి నాయకురాలు జ్యోతి



**జవహర్ నగర్, ఫిబ్రవరి 11 (నినాదం):** గురువారం దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్స్ పెద్ద ఎత్తున పాల్గొని సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణా ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి రేవతి అన్నారు. బుధవారం జవహర్ నగర్ పి హెచ్ సి ఆశావర్కర్ సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు కార్మిక వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం 26వేల రూపాయలకు పెంచి ఆశా వర్కర్లను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి కార్మిక సంఘ హక్కులు కల్పించాలన్నారు. అలాగే 45, 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసులను అమలు చేయాలని, స్కీమ్ కింద పని చేసే వర్కర్ల కోసం ప్రత్యేకంగా పే కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య సదుపాయాలు, వేతనంతో కూడిన సెలవులు, పదవీ విరమణ సమయంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పని గంటలను రోజుకు 8 గంటలకు పరిమితం చేసి పని భారంతగ్గించాలన్నారు. ఎన్.హెచ్.ఎం. (నేషనల్ హెల్త్ మిషన్)ను శాశ్వత ఆరోగ్య కార్యక్రమంగా మార్చాలని, దేశవ్యాప్తంగా ఆశా వర్కర్లకు ఒకే విధమైన పని పరిస్థితులు, వేతన విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మె అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీహెచ్ సి నాయకురాలు జ్యోతి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన కోదాడ పురపోరు!
#### అభ్యర్థుల్లో మొదలైన టెన్షన్
#### 3 వార్డులు కాంగ్రెస్ ఖాతాలో... క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా!
#### బీఆర్ఎస్ ధీమా, స్వతంత్రుల సవాల్... రసవత్తరంగా కోదాడ పోరు
#### ఎవరి వ్యూహం ఫలిస్తుంది? 13న తేలనున్న కోదాడ తీర్పు




**కోదాడ, ఫిబ్రవరి 11( నినాదం):** కోదాడ మున్సిపాలిటీలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో రాజకీయ పార్టీల్లో ఫలితాల ఉత్కంఠ మొదలైంది. మొత్తం 35 వార్డుల్లో ఇప్పటికే 3 వార్డులు కాంగ్రెస్ ఖాతాలోకి చేరడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మిగిలిన వార్డుల్లోనూ క్లీన్ స్వీప్ సాధించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. ఇక టీఆర్ఎస్ పార్టీ కూడా బలమైన పోటీ ఇచ్చామని, ఫలితాలు తమకు అనుకూలంగా వస్తాయని ధీమా వ్యక్తం చేస్తోంది. ముఖ్య వార్డుల్లో తమ అభ్యర్థుల విజయంపై ఆశాభావం వ్యక్తం చేస్తూ గెలుపు కోసం చివరి వరకూ కృషి చేశామని నేతలు చెబుతున్నారు. అదేవిధంగా కొన్ని వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు గట్టి పోటీ ఇవ్వడం గమనార్హం. ప్రధాన పార్టీలకు చెక్ పెట్టేలా స్వతంత్రుల ఓట్ల ప్రభావం ఉంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో త్రికోణ పోటీ నెలకొనడంతో ఫలితాలపై అంచనాలు వేయడం కష్టమవుతోంది.

పోలింగ్ అనంతరం అభ్యర్థులు, పార్టీ శ్రేణులు ఓట్ల లెక్కింపుపై దృష్టి సారించారు. గెలుపు-ఓటములపై అనేక విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కోదాడ రాజకీయ వర్గాల్లో ఉత్కంఠభరిత వాతావరణం నెలకొనగా, ఈనెల 13న వెలువడే ఫలితాలు ఎవరి వ్యూహం ఫలించిందో తేల్చనున్నాయి.

## అనంతగిరి అయ్యప్ప సన్నిధిలో
## 5వ వారపు అన్నప్రసాద వితరణ



**కోదాడ ఫిబ్రవరి 11 (నినాదం):** తెలంగాణా శబరిమల అనంతగిరి శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప సన్నిధిలో సంక్రాంతి నుంచి ప్రారంభమైన ప్రతి బుధవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం 5వ వారంలో విజయవంతంగా నిర్వహించారు.
బాలాజీనగర్ నివాసి శ్రీ మూడు సత్యనారాయణ కుమార్తె అభిషా బాయి పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు అన్నప్రసాదానికి దాతలుగా వ్యవహరించారు.
ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, ఉపసర్పంచ్ గవిని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# మిర్యాలగూడలో 77.44 శాతం పోలింగ్ నమోదు

### ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

**మిర్యాలగూడ ఫిబ్రవరి 11( నినాదం):** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని 48 వార్డులలో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భారీ పోలీస్ బందోబస్తుల నడుమ జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం ఓటర్లు 93,020, ఉండగా 45 128 పురుషులు, 47 878 మహిళలు,14 ఇతరుల ఓట్లు ఉన్నాయి. 48 వార్డుల పరిధిలో 144 పోలింగ్ కేంద్రాలను ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాటు చేసినట్లు మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి ఎన్నికల సహాయ జిల్లా అధికారి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ లు తెలిపారు. ఎన్నికల పోలింగ్ నమోదు అయిన శాతాన్ని పరిశీలిస్తే ఇలా ఉన్నాయి. ఉదయం 9 గంటలకు 48 వార్డుల పరిధిలో 11.16 శాతం పోలింగ్ నమోదు కాగా 10, 383 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. ఉదయం 11 గంటలకు పోలింగ్ వివరాలు పరిశీలిస్తే 31.12 శాతం పోలింగ్ నమోదయింది. 28,945 ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 1-00 గంటకు 53.47 శాతం పోలింగ్ నమోదు కాగా 49,734 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు 68.15 శాతం పోలింగ్ నమోదు కాగా 63,395 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. పోలింగ్ సమయము సాయంత్రం 5 గంటలకు ముగిసింది. పోలింగ్ శాతం 77.44 శాతం పోలింగ్ నమోదు కాగా 72,036 మంది ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. మిర్యాల పట్టణంలోని వివిధ పోలింగ్ కేంద్రాలలో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని 41 వార్డు లోని 123 పోలింగ్ బూత్ లో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి ఓటు హక్కును వినియోగించుకున్నారు. చైతన్య పాఠశాలలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఉదయం ఏడు గంటలకే తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అయిన తనయుడు నల్ల మోతు సిద్ధార్థ దంపతులు వార్డు నెంబర్ 21లో ఓటును వినియోగించుకున్నారు. వార్డ్ నెంబర్ 45 లో ఎంపీడీవో కార్యాలయం పోలింగ్ బూత్ లో నాగలక్ష్మి భార్గవ్ దంపతులు ఓటును వినిగించుకున్నారు. 24వ వార్డు వాసవి నగర్ ఎస్ వి మోడల్









హైస్కూల్లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్ దంపతులు ఓటు హక్కును వేయించుకున్నారు. మిర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి 27 పరిధిలోని జయ హై స్కూల్ పోలింగ్ బూత్ లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 41వ వార్డు ప్రాథమికోన్నత పాఠశాలలో టిడిపి జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మిర్యాలగూడ ఇంచార్జ్ బంటు వెంకటేశ్వర్లు తన ఇద్దరు తనయులతో ఓటును వినియోగించుకున్నారు. 26వ వార్డు పోలింగ్ బూత్ లో అభ్యాస్ విద్యాసంస్థల చైర్మన్ వంగాల నిరంజన్ రెడ్డి డైరెక్టర్ వంగాల పుష్పలత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శాంత ఇ.ఎన్.టి. హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ శేఖర్ రెడ్డి తన ఓటు హక్కును 47 వ వార్డు కేఎల్ఎన్ జూనియర్ కళాశాలలో వినియోగించుకున్నారు.

## రూ.168 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు

- మాజీ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి దంపతులు
- పదవి ముగిసిన మా సేవ ఆగదు..
- మల్కాజిగిరి ఎంపీ ఈటల సహకారంతో డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేకదృష్టి



**మల్కాజిగిరి, ఫిబ్రవరి 12 (నినాదం):** నేరేడ్ మెట్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలలో సుమారు 168 కోట్ల నిధులు వ్యయం తో పలు అభివృద్ధి పనులను చేపట్టి కొన్ని పనులు పూర్తి కాగా, రీ సెంట్ గా శాంక్షన్ అయిన మరికొన్ని పనులు పెండింగ్ లో ఉన్నాయని త్వరలో స్పెషల్ అధికారు లతో మాట్లాడి పనులను పూర్తి చేసేలా కృషిచేస్తామని కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి దంపతులు వెల్లడించారు. 5 సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసిన సందర్భంగా బుధవారం నేరేడ్ మెట్ డివిజన్ డిఫెన్స్ కాలనీ లోని బీజేపీ కార్యాలయం లో విలేకరుల సమావేశం ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతురావు మాకు వెన్నంటు ఉంటు డివిజన్ అభివృద్ధి కి ఎక్కడ వర్క్ చేయాలన్నా, ఏ విషయం లో రాజి పడకుండా గడిచిన మూడు సంవత్సరాలలో రూ.100 కోట్లకు పైగా బడ్జెట్ లను శాంక్షన్ చేయించి, డివిజన్ అభివృద్ధి ని మాతో ముందుకు నడిపారని మైనంపల్లి కి ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. ఈ 5 సంవత్సరాలు నేరెడ్‌మెట్, యాప్రాల్ ప్రాంతాల అభివృద్ధి చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిపోతాయని, గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో రూ.168 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరిగింది. మాటలు కాదు, పనులతోనే ప్రజల విశ్వాసం గెలుచుకున్నామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, థీమ్ పార్కులు, కమ్యూనిటీ హాల్స్, శ్మశానవాటికలు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలపై మాత్రమే రూ.108 కోట్ల పనులు చేపట్టామని, బాక్స్ డ్రెయిన్స్ నిర్మాణానికి రూ.53 కోట్లతో పనులు చేయడం జరిగిందన్నారు... యాప్రాల్‌లో నాగి రెడ్డి చెరువు నుండి కాప్రా చెరువు వరకు రూ. 43 కోట్లు, ఎంప్లాయీస్ కాలనీ రూ.6 కోట్లు, అందాల్ హోమ్స్ -- రూ.2 కోట్లు, బ్యాంక్ కాలనీ -- రూ.3 కోట్లు, ఆర్‌కేపురం చెరువు సుందరీకరణకు రూ.6 కోట్లు, నేరెడ్‌మెట్ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌కు రూ.1 కోటి, భద్రత కోసం రూ.30 లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేయడం జరిగిందన్నారు. మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ గెలిచినప్పటి నుండి మా డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారు. డివిజన్ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల కోసం దాదాపు రూ.4.16 కోట్ల విలువైన పనులకు ఎంపి సిఫారసు లేఖల ద్వారా మంజూరులు అయ్యాయని, దానిలో ముఖ్యంగా అమ్ముగూడ శ్మశానవాటిక అభివృద్ధి, కాలనీలలో కొత్త బోర్‌వెల్స్ ఏర్పాటు, కొన్ని కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ పనులు చేపట్టడం జరిగింది.

**మేము రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం.. మా దృష్టి అంతా డివిజన్ అభివృద్ధి వైపే**

ఎన్నికలు ఆ తర్వాత ప్రతి కాలనీ మనదే, ప్రతి ప్రజా సమస్య మన బాధ్యత అనే ధృఢ నిశ్చయంతో పనిచేశాం. పార్టీ భేదాలు లేకుండా ప్రతి కాలనీకి సమాన అభివృద్ధి అందించామని, డివిజన్‌లో సగానికి పైగా కాలనీల్లో 100% మౌలిక వసతులు కల్పించామని, మొత్తం మీద 60--70% పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు కూడా త్వరలో పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇంకా రూ.15--20 కోట్ల కొత్త ప్రతిపాదనలను జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ కి వినతి పత్రాలను అందజేశాం... ఈ 5 సంవత్సరాలు మాకు అండగా నిలిచిన ప్రతి కాలనీ అధ్యక్షులు, సభ్యులు, అధికారులు, మీడియా మిత్రులకు, డివిజన్ లోని ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ జేశారు.

**పదవి ముగిసినా సేవ ఆగదు...**

నేరెడ్‌మెట్, యాప్రాల్ అభివృద్ధి కోసం ఎప్పటికీ ముందుంటూ, ప్రజల మధ్య ఉంటూ, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## ముగిసిన చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికలు

- ఎన్నికలలో ఓటర్లు అపూర్వ చైతన్యాన్ని ప్రదర్శించారు
- 92 శాతం ఓటింగ్ నమోదు




**మునుగోడు, ఫిబ్రవరి 11 (నినాదం):** మునుగోడు నియోజకవర్గం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ ముగిసిన సందర్భంగా, ఓటర్లు భారీ ఎత్తున ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లు కూడా అపూర్వ చైతన్యాన్ని ప్రదర్శించారు. దానివలన 92 శాతం ఓటింగ్ నమోదు కావడం జరిగింది. ఓటర్లు పట్టణాల నుండి ఒకరోజు ముందే చేరుకొని ఉదయం పోలింగ్ కేంద్రాలలో లైన్లో నిలబడి, ఇష్టంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం వరకు ప్రజలలో అదే ఉత్సాహం కనిపించింది. చౌటుప్పల్ మున్సిపాలిటీలో 20 వార్డులు ఉండగా, 25,800 మంది ఓటర్లు ఉన్నారు. అందులో, 12, 962 మంది మహిళలు ఉన్నారు. 12, 838 మంది పురుషులున్నారు. సాయంత్రం పోలింగ్ మూసే సమయానికి 11,930 మంది మహిళలు, తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 11,783 మంది పురుషులు కూడా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధిక శాతం పురుషులకంటే మహిళలే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యం పట్ల మహిళలకు ఉన్న నిబద్ధత ఈ ఎన్నికలలో స్పష్టంగా కనబడుంది. మహిళల కోసం పలు కేంద్రాలలో ప్రత్యేకమైన సదుపాయాలు కల్పించడం వలన పోలింగ్ సజావుగా జరిగింది. వృద్ధులు సైతం యువతతో పోటీపడి క్యూ లైన్ లో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు జరగలేదు కాబట్టి పోలింగ్ శాతం ఇంత భారీగా నమోదు కావడం జరిగిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఆయా పార్టీల నేతలు ఎవరి ధీమాలో వాళ్ళు ఉన్నారు. ఐదు రోజులపాటు భారీగా జరిగిన ఎన్నికల ప్రచారంలో, పార్టీ నేతలు గెలుపు మాదంటే, మాదేనని ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రంగంలోకి దిగి భారీ ఎత్తున ప్రచారం, ర్యాలీలు నిర్వహించినారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన సంక్షేమ పథకాలను గుర్తుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ప్రచారంలో తెలిపారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ తరఫున మునుగోడు మాజీ ఎమ్మెల్యే, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కూడా గెలుపు మాదే అనే రీతిలో ప్రచారం నిర్వహించారు. గతంలో బి ఆర్ ఎస్ చేసిన అభివృద్ధిని చూసి బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులకు మీ అమూల్యమైన ఓటు వేసి భారీ ఎత్తున గెలిపించాలని, భారీ ర్యాలీలు సభలు నిర్వహించారు. ప్రజల గూడా తమకు ఇష్టమైన అభ్యర్థులకు ఓటు వేయడం వలన 92 శాతం పోలింగ్ నమోదు కావడం జరిగిందని ప్రజలంటున్నారు.

## కోదాడ చైర్మన్ అభ్యర్థిపై ఉత్కంఠ!

- అధికార పార్టీలో అంతర్గత కసరత్తు వేగం

**కోదాడ, ఫిబ్రవరి 11(నినాదం):** కోదాడ మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అధికార పార్టీ తరఫున ఎవరిని ఖరారు చేస్తారనే అంశంపై నేతలు, కార్యకర్తలు, ప్రజల్లో చర్చ కొనసాగుతోంది. ఎమ్మెల్యే నిర్ణయాలు అంచనాలకు అందకుండా ఉండటంతో అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ మరింత పెరిగింది. కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే చైర్మన్ అభ్యర్థి ఖరారు చేయడానికి స్థానిక అధిష్ఠానం కసరత్తు ప్రారంభించనున్నట్లు సమాచారం. పార్టీలో సమీకరణాలు, వార్డు ఫలితాలు, సామాజిక సమతుల్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

#### మొండికుంట - మల్లెలమడుగు గ్రామాల్లో
## కోతుల బీభత్సం
#### ప్రజల జీవనానికి తీవ్ర అంతరాయం
#### తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి





**అశ్వాపురం, ఫిబ్రవరి 11 (నినాదం):** అశ్వాపురం మండలం మొండి కుంట, మల్లెలమడుగులో కోతులు విపరీతంగా సంచరిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గ్రామాల్లోకి గుంపులుగా ప్రవేశిస్తున్న కోతులు ఇళ్లపైకి ఎక్కి ఆహారం ఎత్తుకెళ్లడం, పంటలను నాశనం చేయడం, చిన్నారులు-వృద్ధులను భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో కోతుల దాడులు ఎక్కువగా ఉండటంతో మహిళలు, పిల్లలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల కోతుల వల్ల గాయపడిన ఘటనలూ చోటుచేసుకున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ పరిస్థితిపై గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బీభత్సం నుంచి తమను రక్షించాలని, తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ అధికారులను కోరుతున్నారు. అవసరమైతే అటవీ శాఖ సహకారంతో కోతులను పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలించి వాటికి విముక్తి కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మొండికుంట, మల్లెలమడుగు గ్రామాల ప్రజలు ఏకగ్రీవంగా డిమాండ్ చేస్తున్నారు.

### వాణిజ్య ఒప్పందం నుండి భారత్ వైదొలగాలి...



**ఆర్మూర్, ఫిబ్రవరి 11 ( నినాదం) :** కేంద్ర ప్రభుత్వం అమెరికా భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం ను రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే రద్దు చేసుకోవాలని, భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం నుండి వైదొలగాలని ఏఐయు కె ఎస్, ఏఐపీకేఎంఎస్, టి యు సి ఐ, నాయకులు సారా సురేష్, జి. కిషన్, సత్తెక్క లు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మోర్తాడ్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి లొంగిపోయి భారత దేశ రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే, లోపాయి కారి ఒప్పందాన్ని భారతదేశం వెంటనే వైదొలగాలని వారు డిమాండ్ చేశారు. దేశ రైతాంగం ఉత్పత్తులు, గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని, రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వారన్నారు. ఈ వాణిజ్య ఒప్పందం వల్ల దేశ మొత్తం సంక్షోభంలో కూరుకుపోయిందని, ఆహార ధాన్యాల కొరత ఏర్పడుతుందని, తిండి గింజల కోసం అమెరికా మీద ఆధార పడవలసిన దౌర్భాగ్య స్థితి ఏర్పడుతుందని, ఈ ఒప్పందం వల్ల పాడి రైతులతో సహా మొత్తం రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని వారన్నారు. ఒకే దేశం ఒకే విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న చట్టాలు, విద్యుత్ చట్టం, విత్తన చట్టాలు రైతాంగానికి తీవ్ర నష్టం చేసే విధంగా ఉందని, వెంటనే ఇట్టి విధానాన్ని రద్దు చేసుకోవాలని వారు కోరారు. గురువారం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఫిబ్రవరి 21 నుండి మార్చి 8 వరకు గ్రామ గ్రామాన నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. నూతన విద్యుత్, నూతన విత్తన చట్టం కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దుచేసి, ఎం.ఎస్పి, గ్యారెంటీ చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పిఓడబ్ల్యూ,నాయకురాలు జమున, ఏఐపీకేఎంఎస్. నాయకులు దయాల్ సింగ్, తదితరులు,పాల్గొన్నారు.